క్లుప్తంగా

7న గౌర పౌర్ణమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 7వ తేదీ మంగళవారం ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో గౌర పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు భజన, కీర్తనలు, హారతి, దేవతా మూర్తులకు మహాశంఖాభిషేకం, మహా పుష్పాభిషేకం, 7.45 గంటలకు భగవద్గీతా ప్రవచనాలు, 8.15 గంటలకు మహా హారతి తదితర పూజా కార్యక్రమాలను చేయనున్నారు. అలాగే సాయంత్రం 6 నుంచి 30వేల మంది పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి శ్రీ కృష్ణుని అనుగ్రహం పొందాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పోరుమామిళ్ల : మండల సర్వసభ్య సమావేశం 4వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు మండల అధ్యక్షురాలు తహసిన్ అధ్యక్షతన ప్రారంభమవుతుందని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందని సభ్యులు, అధికారులు సకాలంలో సమావేశానికి రావాలని ఆమె కోరారు.

కోటా దుర్గాభవానికి మొల్లమాంబ పురస్కారం



కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి కోటా దుర్గా భవానీకి మహా కవయిత్రి మొల్లమాంబ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్లు మొల్ల సాహిత్యపీఠం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగ పెంట హనుమంతరావు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో జరగనున్న సభలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం తదితరులు హాజరవుతారన్నారు. మొల్లమ్మ పురస్కారంగా ఆమెకు నగదుతోపాటు జ్ఞాపిక అందించి సత్కరించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న హెడ్ మాస్టర్ ఆవుల శ్రీనివాసులు

మైదుకూరు : పరీక్షల సమయంలో పదో తగరతి విద్యార్థులపై తల్లిదండ్రులు మరింత శ్రద్ధ చూపాలని మండలంలోని జీవీ సత్రం జెడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టర్ ఆవుల శ్రీనివాసులు అన్నారు. నైట్ విజన్‌లో భాగంగా గురువారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హెడ్మాస్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు బోధన విషయంలో ఉపాధ్యాయులు వంద శాతం కృషి చేస్తున్నారన్నారు. ఇక తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా పిల్లలను ఇంటి వద్ద చదివించాలన్నారు. పరీక్షల ముందు విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని తెలిపారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం : ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా గురువారం మండల ఎన్నికల ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ ఏఈ ప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని తోట్లపల్లె దగ్గర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బి.మఠం పోలీసులు పాల్గొన్నారు.

నిరసన

పోరుమామిళ్ల : కమ్యూనిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని గురువారం మండల సీపీఐ నాయకులు అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే డబ్బు పెంచాలని, టిట్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్ కోరారు.

గ్రామీణ తపాల శాఖ ఉద్యోగుల ధర్నా

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక డివిజనల్ పోస్టాఫీసు వద్ద గురువారం ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ యూనియన్ల పిలుపు మేరకు గ్రామీణ తపాల శాఖ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీడీఎస్ కమిటీ సిఫారస్సులను అమలు చేయాలని, సీనియర్లకు ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరారు. ఆచరణ సాధ్యం కాని టార్గెట్స్ ఆపేయాలని, పెండింగ్‌లో ఉన్న జీడీఎస్ సబ్‌స్టిట్యూట్‌ల జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే పాఠశాలల అభివృద్ధి

- ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తాం
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఆదిత్య హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గత ప్రభుత్వం వరకు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగన్ ప్రభుత్వంలోనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిన విషయం ఉపాధ్యాయులందరికీ తెలుసునని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలకు ఓట్లు వేసి గెలిపించాలని గురువారం ఎమ్మెల్యే స్వయంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. అనిబిసెంట్, వైవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేసిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రత్యేకించి తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాశీప్రసాద్‌రెడ్డి, గుర్రప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్థానిక ఆదిత్య హైస్కూల్, జీవన జ్యోతి హైస్కూల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు సైతం అమ్మ ఒడి పథకం అమలవుతోందని గుర్తు చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రతి ఉపాధ్యాయులు తనకు మద్దతు ఇచ్చి ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జీవనజ్యోతి హైస్కూల్ వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, కరస్పాండెంట్ అమరనాథ్‌రెడ్డి, ఆది హైస్కూల్ కరస్పాండెంట్ మోహన్‌రావు, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు పక్కాగృహాలు పూర్తి కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు

బద్వేలు : జగనన్న పక్కాగృహాల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెద్దిరాజు తెలిపారు. గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని స్త్రీశక్తిభవన్‌లో పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేస్తూ లబ్ధిదారులకు సహకారం అందించాలన్నారు. ప్రతి పంచాయతీ వారీగా లేఅవుట్ వారీగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం లేఅవుట్‌లో సకల సౌకర్యాలు కల్పిస్తుందని, లోటుపాట్లు ఉంటే వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పంచాయతీల వారీగా గత వారం నిర్దేశించిన లక్ష్యాలు, చేరుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకుని ఈ వారం లక్ష్యాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పోరుమామిళ్ల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీఓలు నూర్జహాన్, ముజఫర్‌రహీమ్, చంద్రమౌళీశ్వర్, మహబూబ్‌బీ, తహసీల్దార్లు రామచంద్రుడు, రవి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గొంటువారిపల్లెలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంతి

కాశినాయన : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. గురువారం మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. 72 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు రక్తపరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి ఐరన్, కాల్షియం, ఐరన్‌సిరప్ మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ధర్మ రక్షణ నిధి ద్వారా దేవాలయాల భద్రత



మాట్లాడుతున్న వై.రాఘవులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురువారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ ధర్మ రక్షణ నిధి పక్షం రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వ హిందూ పరిషత్ కేంద్ర కార్యకార్ణి సభ్యులు వై.రాఘవులు మాట్లాడుతూ దేశంలో దేవాలయాల భద్రతగాకు సమాజంలో నిస్తేజంగా ఉన్న హిందువులందరు మేల్కోవాలన్నారు. ధర్మరక్ష నిధి దేవాలయాల భద్రత, హిందు సమాజాన్ని సమాయత్తం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, నాయకులు మారెళ్ల మల్లికార్జునరావు, చలపతి, మార్కండేయ, విజయకుమార్, డాక్టర్ లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

రూ.46 లక్షలతో చెరువు కట్ట పనులు



చెరువు కట్ట పనులు చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుంలో బలహీనంగా ఉన్న పెద్ద చెరువు కట్టను పటిష్ట పరిచేందుకు రూ.46 లక్షల జైకా నిధులను తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో కట్టకు ఇరు వైపులా ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను గురువారం నుంచి తొలగించారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టపై మట్టి వేసి నాణ్యతలో రాజీ లేకుండా తెగిన చోట రాతి, సిమెంటు కట్టడం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఉపసర్పంచ్ పీఎస్ మధు పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలు చేయరాదని మహిళలకు అవగాహన కల్పిస్తున్న కెతుర

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సోషియల్ అండ్ బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్ (ఎస్‌బీసీసీ) వైఎస్సార్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ కెతుర తెలిపారు. గురువారం నగర శివార్లలోని న్యూ యానాది కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, ఈ కార్యక్రమానికి పాల్పడితే తల్లిదండ్రులతోపాటు వివాహం చేసే పురోహితులు, పాస్టర్లపైన కూడా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బాలికలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలన్నారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సఖి ఫౌండేషన్‌ప్రతినిధి రహమతున్నీసా, సాయిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాజిరాబీ, మహిళా పోలీసు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా సి–డ్యాప్ సౌజన్యంతో కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలలపాటు ఉచిత కంప్యూటర్, హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణతోపాటు కంప్యూటర్ బేసిక్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్ (7013665112, 9059160549)లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి కోట పోలేరమ్మ తిరునాల

పోరుమామిళ్ల : పట్టణంలోని రంపాడురోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరునాల శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు వైభవంగా జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం పట్టణ ప్రజలు అమ్మవారికి చల్లన్నం తీసుకరావాలన్నారు. ఉదయం 7 గంటలకు కలశస్థాపన, పంచామృతాభిషేకం, పాలాభిషేక కార్యక్రమాలుంటాయన్నారు. శనివారం ఉదయం పోరుమామిళ్ల సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసువారి పూజాకార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, రాత్రి ఏకాంబర భజన జరుగుతుందన్నారు. ఆదివారం కుంకుమబండ్లు, గ్రామోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు.

పింఛన్ అందజేత

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ వలంటీరుగా పని చేస్తున్న సుబ్బారెడ్డి తన విధుల పట్ల సేవా భావాన్ని చాటుకున్నాడు. ప్రభుత్వ వృద్ధాప్య పింఛను పొందుతున్న వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యానికి గురై ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ డబ్బులను అందజేశారు.

నలుగురు మట్కా బీటర్ల అరెస్టు

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో నలుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా మట్కా, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అల్లాడుపల్లె ఆలయ వేద పండితుడికి ఆహ్వానం



వేణుతుర్ల నరేంద్ర శర్మ

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన వేదపండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మకు సర్ సీ.వీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష వైభవ ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది మహోత్సవ సంబరాలకు హాజరుకావాలని ఆహ్వానం పంపారు. 8 రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులకు మార్చి 5న తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాదులోని హరిహర కళాభవనంలో సన్మానం నిర్వహించనున్నారు. ఆయనకు సువర్ణ కంకణం, సామ వేద శిఖామణి బిరుదు సత్కరించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : వెల్లాలలోని డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియేట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.కృష్ణవేణి గురువారం తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినులు ఈ నెల 24లోపు (ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఐఎన్) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం ఐదవ తరగతి విద్యార్థినులకు, మధ్యాహ్నం ఇంటర్మీడియేట్ విద్యార్థినులకు ఉంటుందని వివరించారు. వివరాలకు 97045 50133, 81797 95996 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- గ్రామాల్లో నీటి ఎద్దడి రాకూడదు
- మండల సమావేశంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అధికారులకు సూచించారు. ఖాజీపేట ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో వస్తున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. వాటిని పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం సరైంది కాదని అన్నారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి అన్నది ఉండకూడదన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం అన్ని శాఖల కార్యక్రమాలపై రివ్యూ చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెడ్పీటీసీ దవనం పుష్పలత, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, కనపర్తి సుబ్బారెడ్డి, రాముడు, కో–ఆప్షన్ సభ్యుడు మున్వర్ హుస్సేన్, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చంద్రశేఖర్, యన్నం రాణెమ్మ, వైస్ఎంపీపీ చంద్రభాస్కర్ రెడ్డి, బండి శ్రీనివాసులుతోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్ణయం మేరకు రోడ్డు పనులు



నిలిచిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులోని చౌడమ్మ వీధిలో నిలిచిన రోడ్డు పనులను మున్సిపల్, పోలీసు అధికారుల సమక్షంలో ఇరువర్గాలతో చర్చించి ఎవరికి ఇబ్బంది లేకుండా పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. చౌడమ్మవీధిలో ఇరువర్గాల ఫిర్యాదులతో నిలిచిన రోడ్డు పనిని గురువారం ఆయన పరిశీలించి అందుకు గల కారణాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు వెడల్పు పెంచాలని స్థానికంగా ఉన్న కొంత మంది అభ్యంతరం తెలపడంతో పనులు ప్రారంభించలేదని తెలిసిందని, ఇందు కోసం త్వరలోనే వార్డులోని ఇరువర్గాలకు చెందిన ప్రజలతో చర్చించి ఎవరికి ఇబ్బంది లేకుండా పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.130 కోట్ల నిధులలో రూ.54.99 లక్షలతో 7వ వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జి రమేష్‌బాబు, కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ హసన్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏరోజూ శాసనమండలికి గైర్హాజరు కాలేదు

- ఉపాధ్యాయ సమస్యలపై 20 జీఓలు తెప్పించా
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి



ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ నాయకులు

ప్రొద్దుటూరు : ఇంత వరకు తాను శాసనమండలికి గైర్హాజరు కాలేదని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంబంధించి 20 జీఓలు తెప్పించానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ప్రొద్దుటూరుకు వచ్చిన సందర్భంగా ఆయన స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై 34 ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని, 10 ఏళ్ల సర్వీసును వదులుకుని ఎమ్మెల్సీగా పోటీ చేశానన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత ప్రతి నెలా టూర్ డైరీని ఏర్పాటు చేశానని, ప్రతి ఏడాది వార్షిక ప్రగతి నివేదికను విడుదల చేస్తున్నానన్నారు. తాను ప్రొద్దుటూరులోని హాస్టళ్లలో రాత్రి నిద్ర చేసి సమస్యలను చెప్పడంతో ప్రభుత్వం రూ.52 కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిందన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. పీడీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, అన్నయ్య జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, రీజనల్ కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కాలేజీల్లోని అధ్యాపకుల ఖాళీలను క్రమం తప్పకుండా ఏపీపీఎస్సీ ద్వారా ప్రభుత్వం భర్తీ చేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక గౌతమి ఇంజనీరింగ్ కాలేజిని ఆయన సందర్శించి అధ్యాపకులతో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత ఇంజనీర్ ఎస్‌పీఎస్ రామచంద్రారెడ్డి, కొండయ్య, విశ్రాంత అధ్యాపకులు కోటా ఓబుళరెడ్డి, సంస్కృత అధ్యాపకులు రమణ, ఉపాధ్యాయులు షేక్షావలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాన్యులపై మోయలేని భారం

ప్రొద్దుటూరు క్రైం : నిత్యం ధరలను పెంచుతూ బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రూ.410కే వంటగ్యాస్ అందించిందన్నారు. సబ్ కా వికాస్ కాదని, సబ్‌కా వినాస్ లాగా బీజేపీ పాలన ఉందని ధ్వజమెత్తారు. గ్యాస్ ధరలను తగ్గించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు రామాంజనేయులు, భాస్కర్, సీమోన్ పాల్గొన్నారు.

ప్రీతి మరణానికి కారకులైన వారిని శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

పోరుమామిళ్ల : మెడికో ప్రీతి మరణానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, మానవ హక్కుల పరిరక్షణ సంఘం, దళిత నాయకులు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో లింగ వివక్ష ఉండకూడదు



చాపాడు: లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చాపాడు : సమాజంలో ఏ ఒక్కరూ లింగ వివక్ష చూపరాదని హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి పేర్కొన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆడ మగ అనే భేదం చూపకుండా తల్లిదండ్రులు పిల్లలను పోషించాలన్నారు. లింగ వివక్ష కారణంతోనే భ్రూణ హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం లింగ వివక్షపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాముడు, కస్తూర్బా గాంధీ ఎస్‌ఓ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు రెబాకా, స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ ఉషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

దువ్వూరు : చిన్న వయసులోనే ఆడ పిల్లలకు పెళ్లి చేయడం చట్ట విరుద్ధమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బేటి పడావో – బేటి బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆడ పిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లల విషయంలో భేదాలు చూపకూడదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. భ్రూణ హత్యలను నివారించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మల్లేశ్వరి, ఏఎస్ఎం మాధవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

బి.కోడూరు : ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అని మండల వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. గురువారం మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గర్భస్థ పిండ పరీక్షలు చేసే ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, జన్యు చికిత్స కేంద్రాలు గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణ మండలి మరియు దుర్వినియోగ నివారణ చట్టం–1994 చట్టప్రకారం నమోదై ఉండాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే మొదటి తప్పుకు 3 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా, అదే తప్పు రెండవసారి చేస్తే 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్ విలియం, విజయలక్ష్మి, ఏఎన్ఎం కుమారి, కస్తూర్బాగాంధీ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.కుమారి, ఉపాధ్యాయనీలు పాల్గొన్నారు.